1

నవతెలంగాణ

ఆదిలాబాద్

శుక్రవారం | జులై 26, 2024 | www.navatelangana.com

వరంగల్ ఎన్ఐటీకి విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-భైంసా



ప్రతిష్టాత్మక వరంగల్ ఎన్ఐటిలో భైంసాకు చెందిన ఎల్.ప్రభాస్ బి.టెక్(ఈసీఈ) విభాగంలో సీటు సాధించారు. భైంసాలోని రామ్‌నగర్ చెందిన లాభిశెట్టి ప్రవీణ్-రాధిక కుమారుడు జెఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చడంతో జోస్సా కౌన్సెలింగ్ ద్వారా ఎన్ఐటిలో సీటు దక్కింది. భైంసాలోని ప్రైవేట్ పాఠశాలలో పదవ తరగతి వరకు చదివాడు. హైదరాబాద్‌లో ఇంటర్ పూర్తి చేశాడు. జెఈఈ అడ్వాన్స్‌లోనూ ప్రతిభ కనబర్చాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

చట్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చట్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాటశాల నెం.2లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ పౌరుల కోసం ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకొచ్చిందన్నారు. దాని గురించి తెలియక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్తగా వచ్చిన చట్టాల గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో సదస్సు నిర్వహించామన్నారు. న్యాయవాదులను నియమించుకోలేని వారికి ఉచితంగా డీఎల్ఎస్ఏ ద్వారా న్యాయవాదులను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అశోక్ అర్గుల్వార్, ఉమేష్ డోలే, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బడుగులకు భరోసా..సంక్షేమానికి పెద్దపీట..!

- ఆరు గ్యారంటీల అమలుకు నిధులు కేటాయింపు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రత్యేక నిధులు
- ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రాజెక్టులకు మహర్దశ
- తొలివిడతలో 35వేల ఇండ్ల నిర్మాణానికి అవకాశం
- రాష్ట్ర బడ్జెట్‌తో ఉమ్మడి జిల్లావాసుల్లో ఆశలు

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లావాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతితో పాటు సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యం కల్పించింది. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలకు నిధులు కేటాయించడంతో పాటు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. తాజాగా వివిధ కార్పొరేషన్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడం ద్వారా వివిధ రకాల రుణాలు పొందడం ద్వారా పేద వర్గాలకు ప్రయోజనం చేకూరనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా రాష్ట్రంలో ఆరు సాగునీటి ప్రాజెక్టులకు తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించగా..ఇందులో నాలుగు ఉమ్మడి జిల్లాకు చెందినవి ఉండటం గమనార్హం. రైతు కూలీలకు ఏటా రూ.12వేల చొప్పున అందజేస్తామని ప్రకటించింది. గురువారం అసెంబ్లీలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఆర్థిక పద్దుతో ఉమ్మడి జిల్లాలో వివిధ వర్గాలకు చేకూరే ప్రయోజనంపై కథనం..

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌లో వివిధ వర్గాలకు మేలు చేకూరేలా నిధులు కేటాయింపులు చేసింది. ప్రభుత్వం ఇది వరకు అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలతో పాటు వివిధ సంక్షేమరంగాలకు అధిక ప్రాధాన్యం కల్పించింది. విద్యా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధితో పాటు నీటిపారుదల, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రాధాన్యం కల్పించింది. నిధులలేమితో కొట్టుమిట్టాడుతున్న కార్పొరేషన్లకు నిధులు ఇవ్వడంతో ఇది వరకు నిలిచిపోయిన వివిధ కార్పొరేషన్ల రుణాలు తాజాగా పొందేందుకు సౌలభ్యం కలగనుంది. ఎస్సీల సంక్షేమానికి రూ.33,124 కోట్లు కేటాయించడంతో ఉమ్మడి జిల్లాలో 5.32లక్షల కుటుంబాలకు మేలు జరగనుంది. ఎస్టీ సంక్షేమానికి రూ.17,065కోట్లు కేటాయించగా..ఉమ్మడి జిల్లాలో 5.83లక్షల కుటుంబాలకు వర్తించనుంది. బీసీ సంక్షేమానికి రూ.9200కోట్లు కేటాయించగా.. ఉమ్మడి జిల్లాలో 13.74లక్షల కుటుంబాలకు మేలు జరగనుంది. మైనార్టీ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.3003కోట్లు కేటాయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో 3,32లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. గతంలో నిలిచిపోయిన కార్పొరేషన్ రుణాలు ఈ ఏడాది నుంచి ప్రారంభమవుతాయని తెలుస్తోంది. దీంతో అనేకమంది పేద లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గానికి 3500చొప్పున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నిధులు కేటాయించడంతో ఉమ్మడి జిల్లాలో తొలి విడతలో 35వేల మంది ఇండ్లు లేని వారికి లబ్ధి చేకూరనుంది.

అన్నదాతలకు మేలు..!

ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఇప్పటికే తొలి విడత రుణమాఫీ ప్రక్రియను పూర్తిచేయగా.. రెండో విడతకు సైతం నిధులు కేటాయించినట్లు ఉంది. తొలి విడత రుణమాఫీకి ఉమ్మడి జిల్లాలో 3.90లక్షల మంది రైతులు అర్హులుగా తేలగా.. ఇందుకు రూ.2217కోట్లు అవసరమని భావించింది. తొలివిడతలో 1.20లక్షల మందికి రుణం మాఫీ కాగా ఇందుకు రూ.572.15కోట్లు వెచ్చించింది. ముఖ్యంగా రైతుబీమాకు కూడా నిధుల కేటాయింపుతో ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 4.41లక్షల మంది రైతులు అర్హులుగా ఉన్నారు. ముఖ్యంగా ఫసల్‌బీమా పథకం కింద పంటలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని నిర్ణయం తీసుకోవడంతో ఉమ్మడి జిల్లాలో 17.30లక్షల ఎకరాలకు ఈ బీమా వర్తించనుంది. ముఖ్యంగా ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీనిచ్చిన విధంగా రైతు కూలీలకు కూడా ఏటా ఆర్థిక సాయం అందిస్తామని చెప్పడంతో ఇందుకు నిధులు కేటాయింపులు చేసింది. జిల్లాలో ప్రతిఏటా 3.26లక్షల మంది రైతు కూలీలకు రూ.12వేల చొప్పున సాయం అందనుంది. మరోపక్క వరికి ఎకరానికి రూ.500చొప్పున బోనస్ అందిచనున్నట్లు ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 2.50లక్షల ఎకరాలకు వర్తించనున్నట్లు తెలుస్తోంది.

నాలుగు ప్రాజెక్టులకు మహర్దశ..!

రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతలో ఆరు సాగునీటి ప్రాజెక్టులను బాగు చేసి సాగునీటిని అందించాలని భావిస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం వీటిపై సమీక్షించారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన రూ.22301కోట్లలో ఉమ్మడిజిల్లాకు కూడా రానున్నాయి. ఆరు ప్రాజెక్టుల్లో నాలుగు ప్రాజెక్టులు ఉమ్మడి జిల్లాకు చెందినవి ఉన్నాయి. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో సదర్మాట్, లోకేశ్వరం మండలంలో పిప్రి, మంచిర్యాల జిల్లాలోని నీల్వాయి, ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్టులకు నిధులు విడుదలకానున్నాయి.

ఆరు గ్యారెంటీలకు నిధులు..!

ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా అమలు చేస్తున్న వివిధ పథకాలకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. గృహజ్యోతి పథకం కింద ఉమ్మడి జిల్లాలో 8.16లక్షల మంది వినియోగదారులు ఉండగా ఇందులో 3.54లక్షల మంది జీరో బిల్లు పొందుతున్నారు. వంట గ్యాస్ కనెక్షన్లు 7.22లక్షలు ఉండగా ఇందులో రూ.500లకే గ్యాస్ పొందుతున్న వారు ఉమ్మడి జిల్లాలో 3.48లక్షల మంది ఉన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుండగా.. ఉమ్మడి జిల్లాలో రోజూ 1.50లక్షల మంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇలా ఆయా పథకాలకు నిధులు కేటాయించడంతో ఈ ఏడాది లక్షలాది మంది అర్హులైన వారు పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం లభిస్తుంది.

తీవ్ర నిరాశకు గురిచేసేలా బడ్జెట్ : జోగు రామన్న, మాజీ మంత్రి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజానీకాన్ని తీవ్ర నిరాశకు గురిచేసేలా ఉంది. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం ఆ పార్టీ నేతలకు మాత్రమే సంతప్తికరంగా ఉంది. ప్రజానీకానికి ఎటువంటి భరోసా ఇవ్వలేని బడ్జెట్‌గా మిగిలిపోనుంది. ఏ ఒక్క వర్గానికి న్యాయం చేసేలా బడ్జెట్ కనిపించడం లేదు. ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. వివిధ సంక్షేమ పథకాల అమలుపై స్పష్టతనివ్వలేదు. రైతుల వ్యతిరేక బడ్జెట్‌గా మిగిలిపోయింది.

కేటాయించిన పద్దును ఖర్చు చేయాలి : దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంతృప్తికరంగా ఉంది. కానీ కేవలం కేటాయింపులకే పరిమితం కాకుండా నిధులు విడుదల చేసి ఖర్చు చేయాలి. గత ప్రభుత్వం భారీగా కేటాయింపులు చేసినప్పటికీ ఖర్చు చేయలేకపోయింది. అర్హత కలిగిన ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేసి ఇంటి నిర్మాణానికి కనీసం రూ.10లక్షల చొప్పున కేటాయించాలి. మహిళలకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని వడ్డీలేకుండా రూ.2లక్షలకు పెంచాలి.





వనపర్తి హాకీ సెంటర్‌కు జిల్లా క్రీడాకారుల ఎంపిక అభినందనీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగే వనపర్తి హాకీ సెంటర్‌కు ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కొలాం ఆశ్రమ పాఠశాలకు చెందిన మడావి ప్రసాద్, కుర్సంగె ధను కుమార్ వనపర్తి హాకీ సెంటర్‌కు ఎంపికైన సందర్భంగా పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన ఇద్దరు క్రీడాకారులను శాలువా పూలమాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగే హాకీ సెంటర్ వనపర్తికి జిల్లా నుంచి విద్యార్థులం ఎంపికవ్వడం గొప్ప విషయమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా విద్యార్థులు ఆయా క్రీడా రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ ఆశ్రమ పాఠశాల నుండే ఎక్కువగా విద్యార్థులు హాకీ క్రీడలో పాల్గొనడం విశేషమని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ భీమ్‌రావు రాథోడ్, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, ఏటిడబ్ల్యూఓ నిహారిక, పాఠశాల హెచ్‌ఎం నారాయణ, కోచ్ శ్రీనివాస, రవి, పిఈటి సునీల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కాసిపేట :మండలంలోని సోమగూడెం పాత బస్తీ బ్రిడ్జి సమీపంలోని కల్వర్ట్ వద్ద స్కూటీ అదుపు తప్పి కాసిపేటకు చెందిన పెంజర్ల లక్ష్మణ్(32) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గురువారం ఉదయం లక్ష్మణ్ సోమగూడెం నుండి కాసిపేటకు హోండా యాక్టివా స్కూటీపై అతివేగంగా అజాగ్రత్తగా వెళ్తున్నాడు. కాసిపేట శివారులో గుంతలోకి టైర్ వెళ్లడంతో స్కూటీ పైనుండి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి బాపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. లక్ష్మణ్ మృతితో కుటుంబంలో, కాసిపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ద్విచక్ర వాహనదారులందరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని, అమూల్యమైన జీవితాన్ని కాపాడుకోవాలని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సూచించారు.

కార్మికులకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

ఆదిలాబాద్‌టౌన్ :మున్సిపల్‌లో పనిచేసే పారిశుద్ధ కార్మికులకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఏఐటీయుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ కోరారు. ఈ విషయమై గురువారం డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి ఈ నెల 30న మున్సిపల్ కార్మికులందరికి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని వెల్లడించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సిర్రా దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు మంతెన కాంతారావు, కార్యదర్శి మెరుగు చిరంజీవి, నారాయణరెడ్డి, శేషుబాబు పాల్గొన్నారు.

ఎంఈఓ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని సోనాపూర్, నాయకపుగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీపీఎస్ సోనాపూర్ పాఠశాలలో 30 మంది విద్యార్థులకు 25 మంది, నాయకపుగూడ పాఠశాలలో 22 మంది విద్యార్థులకు 19 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ రికార్డులను పరిశీలించారు. దీంతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జాసింత, జ్యోతి, సీసీవో రాంబాబు పాల్గొన్నారు.

మహిళా శక్తి యూనిట్ల స్థాపనకు లబ్ధిదారులను ఎంపిక చేయాలి

ఆదిలాబాద్‌టౌన్ : మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహిళ శక్తి యూనిట్ల స్థాపనకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మహిళా సమాఖ్య సంఘాలతో సమావేశం నిర్వహించి మహిళ శక్తిలో యూనిట్ల గురించి తెలియజేశారు. యూనిట్ విలువ, ఏ విధంగా స్థాపించాలి, రుణాలు తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. అదే విధంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో దోమల వృద్ధి నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూడాలని సూచించారు. మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం మహిళ శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. క్యాంటిన్, క్యాటరింగ్, కోల్డ్‌రేజీ లాంటి వాటిని స్థాపించేలా బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలను అందిస్తుందన్నారు. ఆసక్తి గల మహిళ సంఘాల సభ్యులు ముందుకు రావాలన్నారు. క్యాంటిన్, కోల్డ్ స్టోరీల ఏర్పాటుకు స్థలాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ ఆర్‌ఎం పూర్ణచందర్, డీఎంసీ శ్రీనివాస్, మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యకు కేటాయింపులు పెరిగినా సరిపోవు : టీఎస్‌యూటీఎఫ్

నిర్మల్ : బడ్జెట్‌లో విద్యకు కేటాయింపు పెరిగినప్పటికీ సరిపోదని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరం రూ.2,90,000 కోట్ల బడ్జెట్‌లో విద్యకు రూ.19,093 కోట్లు కేటాయించారని తెలిపారు. ఈ సంవత్సరం రూ.2,91,000 కోట్ల బడ్జెట్‌లో రూ.21,292 కోట్లు కేటాయించారని, గత సంవత్సరం కంటే రూ.2,200కోట్లు అదనంగా కేటాయించినప్పటికీ, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న 15 శాతంలో సగానికి మించలేదని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ఈ కేటాయింపు ఏమాత్రమూ సరిపోవని తెలిపారు. పున:సమీక్షించి విద్యకు బడ్జెట్ పెంచాలని కోరారు. పలు పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, నూతన భవనాలు నిర్మించాలని, టాయిలెట్లు, తాగు నీటి వసతులు కల్పించాలని, అల్పాహారం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించటానికి నిధులు కేటాయించాలని కోరారు.

పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

నస్పూర్ : ఎలాంటి అనుమతులు లేకుండా డాన్ స్కూల్ పేరుతో అడ్మిషన్లు తీసుకొని పాఠశాలను నడుపుతున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలైన పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఓ ప్రకటన విడుదల చేశారు. నస్పూర్ మండల కేంద్రంలో పూర్తికాని భవనంలో అడ్మిషన్లు తీసుకొని పాఠశాలను నడిపిస్తున్నారన్నారు. అనేక సందర్భాలలో సంబంధిత అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ రెండు రోజుల క్రితం నోటీసులు ఇచ్చారన్నారు. అయినా స్కూల్ యాజమాన్యం లెక్క చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నడిపిస్తున్నారన్నారు. స్కూలుకు సంబంధం లేని వ్యక్తులను తీసుకొచ్చి తమపై భౌతిక దాడులకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి యజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఈదునూరి అభినవ్, నస్పూర్ మండల ఉపాధ్యక్షులు అరవింద్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ సన్నీ గౌడ్, కుతుబ్ డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నవతెలంగాణ-నిర్మల్



సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో తప్పనిసరిగా డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కాలానుగుణ వ్యాధులైన డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటివి వ్యాపించకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పకడ్బందీగా పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. దోమలు వ్యాపించకుండా ఉండేందుకు అన్ని ప్రాంతాలలో ఫాగింగ్ నిర్వహించి, దోమ నివారణ రసాయనాలను పిచికారి చేయాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేసి దోమల వృద్ధిని అరికట్టాలన్నారు. ప్రతిరోజు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సర్వేలు నిర్వహించి, ఇండ్లలో నీరు నిల్వ ఉన్నట్లు గుర్తిస్తే వాటిని తొలగింపజేయాలని తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి రక్త పరీక్షలు చేయాలన్నారు. డ్రైడే కార్యక్రమాలు, వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యల వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. రెండో విడత ఫీవర్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అన్ని విద్యా సంస్థల్లో ఫీవర్ సర్వేలను, ఫాగింగ్ చేపట్టాలన్నారు. అన్ని ప్రైవేట్ విద్యా సంస్థల్లో సైతం మెరుగైన పారిశుధ్య చర్యలు తీసుకోవాలని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందున రోడ్లు బాగాలేని గ్రామాలలో ప్రసవాలకు దగ్గరగా ఉన్న మహిళలను గుర్తించి, వారిని బర్త్ వెయిటింగ్ రూమ్‌లకు తరలించాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి వాటిని ఖాళీ చేయించాలని ఆదేశించారు. పిచ్చి మొక్కలు, పొదలను తొలగించి, నీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ధన్‌రాజ్, జెడ్పి సీఈవో గోవింద్, డీఈవో రవీందర్‌రెడ్డి, పంచాయతీరాజ్, వైద్య శాఖ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని లంబాడితండా(డి)లో మహిళను హత్య చేసిన కేసులో నేరస్తుడిని అరెస్ట్ చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం దేవాపూర్ పోలీస్‌స్టేషన్లో నిందితుడు కుడిమెత అంబారావును అరెస్ట్ చూపించి దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులతో కలిసి వివరాలను వెల్లడించారు. అజ్మీర నీల(44) తన భర్త చనిపోవడంతో 15 ఏళ్ల నుంచి పల్లంగూడకు చెందిన గాండ్ల రవితో సహజీవనం చేస్తోంది. గాండ్ల రవి స్నేహితుడు కోనూర్ గోండుగోడుకు చెందిన కుడిమెత అంబారావు అజ్మీర నీలను కొన్ని రోజులుగా తన కోరిక తీర్చాలని వెంట పడుతున్నాడు. అందుకు నీల నిరాకరించడంతో బుధవారం మధ్యాహ్నం రవి ఇంట్లో లేని సమయంలో అంబారావు ఆమె ఇంటికి వెళ్లి తన కోరిక తీర్చడం లేదని నీలను గొంతు పిసికి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసి పారిపోయాడు. గురువారం యాప ఆటో స్టాండ్ వద్ద నేరస్తుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. డీసీపీ భాస్కర్ సూచనలతో, ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో కేసుని ఛేదించిన సీఐ శశిధర్, ఎస్ఐ ఆంజనేయులు, దేవాపూర్ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని రామగుండం సీపీ శ్రీనివాస్ అభినందించారు.

సింగరేణి ఆధ్వర్యంలో వన మహోత్సవం



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని సోమగూడెం పాత బస్తీ బ్రిడ్జి సమీపంలోని మందమర్రి ఏరియాలో కేకే ఓసి రాళ్ల వాగు లీజ్ హోల్డ్ ఏరియాలో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ ఆధ్వర్యతన మూడు హెక్టార్లలో 300 మొక్కలను బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ, ఎఫ్ఎవో విజయ్‌కుమార్, ఎస్ఆర్వో సుభాష్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌తో కలిసి జీఎం మనోహన్ మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ కూడా బాధ్యతగా తీసుకున్నప్పుడే అవి వృక్షాలై పర్యావరణ సమతుల్యానికి దోహదపడతాయని తెలిపారు. అదేవిధంగా సింగరేణి కాలరీస్ యాజమాన్యం కాలానుగుణంగా కొన్ని కోట్ల మొక్కలు నాటడం, పెంచడం, పంచడం లాంటి కార్యక్రమాన్ని చేస్తూ వస్తుందన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతంలో ప్రజలకు మొక్కలను పంచి పర్యావరణానికి దోహదం చేసే చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా స్వీకరించి తమ ప్రాంతాలలో మొక్కలు పెంచి వాటిని వృక్షాలుగా చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం ఉద్యోగులకు, చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు మొక్కలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు అంజనేయులు, అధికారుల సంఘం అధ్యక్షులు రమేష్, ఏరియా సేఫ్టీ అధికారి రవీందర్, ఏరియా సర్వే ఆఫీసర్ ఉజ్వల్ బందోపాధ్యాయ, ఏజీఎం నాగరాజు, డీజీఎం రాజన్న, కేకే ఓసీపీ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, ప్రాజెక్ట్ ఇంజనీర్ సూర్యనారాయణ రాజు, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి, ఎన్విరాన్మెంటల్ అధికారి ప్రభాకర్, ఐటీ సీనియర్ ప్రోగ్రామర్ రవి, సీనియర్ అధికారులు, జీఎం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డీసెట్ ఫలితాలు విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్

డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎడ్) కళాశాలలో సీట్ల భర్తీ కోసం ఈ నెల 10న ఆన్‌లైన్‌లో నిర్వహించిన డీఈఈ సెట్-2024 పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు ఆదిలాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫలితాల కోసం ఈ డీసెట్.సీడీఎస్ఈ.తెలంగాణ.గౌ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ, వెబ్ ఆప్షన్ల నమోదు, సీట్లు కేటాయింపు వంటి తేదీలు త్వరలో విడుదలవుతాయని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | జులై 26, 2024 | www.navatelangana.com

స్వర్ణ ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని స్వర్ణ జలాశయంలోకి ఎగువ మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,183 అడుగులకు కాగా, ప్రస్తుతం 1,180.1 అడుగులకు చేరింది. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో 2,700 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో అధికారులు గురువారం మధ్యాహ్నం ఒక గేటు ద్వారా 1,810 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

ముధోల్ తహసీల్దార్‌గా శ్రీకాంత్

నవతెలంగాణ-ముధోల్



ముధోల్ మండల తహసీల్దార్‌గా శ్రీకాంత్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు పనిచేసిన ముధోల్ తహసీల్దార్ విఠల్ బదిలీపై నిజామాబాద్ జిల్లాకు వెళ్లారు. దీంతో నిజామాబాద్ జిల్లాలో పని చేసిన తహసీల్దార్ శ్రీకాంత్ ముధోల్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈయనకు కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

పాఠశాలలో బోనాల పండుగ



నవతెలంగాణ-ముధోల్

బాసర మండల కేంద్రంలోని శ్రీనాగభూషణం విద్యాలయంలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబురావు మాట్లాడారు. తెలంగాణ అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది బోనాల పండుగ అని, ఈ పండుగకు చాలా ప్రాముఖ్యత ఉన్నదని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా మా పాఠశాల విద్యార్థినులతో పాటు ఉపాధ్యాయురాలుతో కలిసి బోనాల పండుగ జరుపుకున్నామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాలలో నిర్వహించిన బంగారు బోనం ఉత్సవాలకు మహిళా ఉపాధ్యాయురాలు జ్యోతి ప్రజ్వలన చేశారు. దుర్గామాత చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. బోనాల ఉత్సవాలు పల్లెల్లోనే కాకుండా, విదేశాల్లో సైతం వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్

ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల, డివిజన్‌స్థాయి రెవెన్యూ అధికారులతో ధరణి, ప్రభుత్వ స్థలాల రక్షణ, వివిధ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సమావేశం నిర్వహించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారం, మండలాల వారీగా వివిధ దరఖాస్తులు, ఇప్పటివరకు పరిష్కరించినవి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. ప్రభుత్వ స్థలాలు అక్రమణకు గురి కాకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు చెరువు భూములను కబ్జా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైన దృష్ట్యా విద్యార్థులకు ఆదాయ, కుల, నివాస ధృవీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలన్నారు. అలాగే జనన, మరణ ధృవీకరణ పత్రాలను సకాలంలో అందజేయాలని సూచించారు. ధరణి దరఖాస్తులు, వివిధ మాడ్యూల్స్, సెషన్స్, కోర్టు కేసులు ఇతర అంశాలపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీఓలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డిలు, కలెక్టరేట్ ఏఓ సూర్యారావు, ఈడీఎం నదీం, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొంచిఉన్న ప్రమాదం

నవతెలంగాణ-లోకేశ్వరం



మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఓ విద్యుత్ స్తంభం శిథిలమై, మరో విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో డ్రైనేజీ పనులు చేసే సమయంలో అధికారులు విద్యుత్ స్తంభం మారుస్తామని చెప్పినా ఇప్పటివరకు స్తంభాన్ని మార్చలేదని, వారు మండిపడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బీసీ(ఎ)గా మార్చాలని ముదిరాజ్‌ల వినతి

నవతెలంగాణ-కుభీర్

ముదిరాజ్ కులస్తులకు బీసీ(డి) నుంచి బీసీ(ఏ)గా మార్చాలని గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌ల సంఘం మండలాధ్యక్షుడు సూది రాజన్న మాట్లాడుతూ చేనేత కార్మికులు, గౌడ కులస్తులకు ఇచ్చినట్టుగానే ముదిరాజ్, మత్స్యకారుల ఆసరా పెన్షన్లు సౌకర్యం కల్పించాలని కోరారు. అదే విధంగా ముదిరాజ్ కులస్తులకు ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేయాలని కోరారు. మత్స్యకారుల ఉచిత చేప పిల్లను పంపిణీ 100శాతం మత్స్యకారులకు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. రాజకీయ రంగంలో ముదిరాజ్‌లకు ప్రాతిద్యం పెంచడానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు చింతల్ బొరి గంగాధర్, సట్ల గంగాధర్, జైరాం, బుచ్చన్న, అడెల్లు, శేఖర్ ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ బోథ్ అసెంబ్లీ అధ్యక్ష బరిలో రైతుబిడ్డ

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలో జరగబోయే యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో బోథ్ అసెంబ్లీ అధ్యక్ష పదవికి బరిలో సొనాల నుంచి గుడాల అనీష్ బరిలో ఉన్నట్టు తెలిపారు. ఆగష్టు 5 నుంచి సెప్టెంబర్ 5 వరకు జరిగే ఈ ఎన్నికలలో పోటీలో ఉంటున్నట్టు తెలిపారు. అందుకు బుధవారం నామినేషన్ వేశామని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు తమకు మద్దతుగా యువకులను ప్రోత్సహించాలని, ఆన్‌లైన్ ద్వారా తమకు ఓటు వేయించి, అత్యధిక మెజారిటీ వచ్చేలా చూడాలని కోరారు.

గోపాల మిత్రలను పశుసంవర్ధక శాఖలో విలీనం చేయాలి

నవతెలంగాణ-బోథ్

పశుసంవర్ధకశాఖలో కాంట్రాక్ట్ బేసిక్‌లో పనిచేస్తున్న గోపాలమిత్ర లను ప్రభుత్వంలో విలీనం చేసి, కనీసం వేతనం ప్రకటించాలని కోరుతూ గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను తన నివాసం గోపాల మిత్రల సంఘం ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి పశుసంవర్ధక శాఖలో గోపాల మిత్రలుగా పని చేయడం జరుగుతుందన్నారు. చాలిచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నామని అన్నారు. తమను పశుసంవర్ధ శాఖలో వీలీనం చేసే విధంగా అసెంబ్లీలో మాట్లాడాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశంలో గోపాలమిత్రల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో గోపాలమిత్ర సంఘం బోథ్ కార్యదర్శి జాదవ్ గోపాల్, ప్రచార కార్యదర్శి మేకల ప్రవీణ్ ఉన్నారు.

రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-తాంసి

రోడ్డు పనులను త్వరగా ప్రారంభించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. గురువారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామాభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో జెడ్పీఎస్-ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. గ్రామస్తులు పలువురు తమ సమస్యలను వివరిస్తూ, గత ఏన్నో సంవత్సరాలుగా రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. దానిని ఎవరు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భీంపూర్ రోడ్డుకు సంబంధించి రోడ్డు పనులకు సంబంధించిన నిధులు మంజూరు చేయడం జరిగిందని, కాంట్రాక్టర్‌తో మాట్లాడి తొందరగా పనులు చేయించాలని అధికారులను ఆదేశించామని అన్నారు. ఐటీఐ స్టార్ట్ అయిన తర్వాత భీంపూర్ మండలంలో ప్రత్యేకంగా ఐటీఐ గురించి, చాలా మంది యూత్‌ని ప్రోత్సాహించి శిక్షణ ఇవ్వగలిగితే మంచి ప్యాకేజీతో ఉపాధి అవకాశాలు వచ్చే ఆస్కారం ఉంటుందని అన్నారు. ప్రభుత్వ స్కూల్, కాలేజ్ ఏవైతే ఉన్నాయో అక్కడ విద్యాబోధన అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అందరూ మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ బాగా చదువుకోవాలని చదువుతోనే మంచి భవిష్యత్ ఉందని, పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. అంతకు ముందు భీంపూర్‌లో పత్తి చేను పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, రుణమాఫీ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, ఏఓ రవీందర్, ఏఈ శంకర్, ఎంఈఓ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-తాంసి



పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నిఖిల్ రాజ్ అన్నారు. గురువారం వర్షాకాలం దృష్ట్యా ముందస్తు ప్రణాళికలలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని జాతీయ కీటక జనిత ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొజ్జన్‌గూడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, 55 మందిని పరీక్షించి, మందులను అందజేశారు. గ్రామంలో ఆరోగ్య సిబ్బందితో కలిసి పర్యటించి, ప్రజలకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్లోరినేషన్ చేసిన నీటిని, గాని కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వేడి ఆహారపదార్థాలను తినాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, నిల్వ నీటిపై మూతలను ఉంచాలని తెలిపారు. యాంటి లార్వల్ రసాయనాన్ని మురుగునీటి, మంచినీటి నిల్వలపై పిచికారి చేయించడం జరిగిందన్నారు. మరుగుదొడ్డిని వాడిన ప్రతిసారి చేతులను సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలపై శ్రద్ధ చూపాలని, జ్వరం, నీళ్ల విరేచనాలు వచ్చిన వెంటనే ఆశా కార్యకర్తలను, సంప్రదించాలి. ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోని, డాక్టర్ల సూచనలతో మందులను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, ఎంఎల్‌హెచ్‌పీ ఏ.సాహితి, ఆరోగ్య కార్యకర్తలు డి.సుజాత, గోదావరి, ఆశా కార్యకర్త జయమాల, అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి పాల్గొన్నారు.

పాముకాటు ఘటనను సుమోటోగా తీసుకుంటున్నాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఎస్టీ గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థి జాదవ్ సిద్ధు పాముకాటు ఘటనను సుమోటోగా తీసుకుంటున్నామని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సౌజన్య తెలిపారు. గురువారం ఆ కళాశాలను తనిఖీ చేసి ఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ముందుగా వంటశాలను పరిశీలించి, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాలను అపరిశుభ్రంగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల తరగతి గదులు, ఇతర గదులను పరిశీలించి, బెడ్లు ఉన్న రిపేర్ కారణంగా వాటిని పక్కన బెట్టినట్టు గుర్తించి, మరమ్మత్తులు చేయించాలని ప్రిన్సిపల్ అనిల్‌కు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రెండు వారాల తరువాత మళ్లీ వస్తామని అప్పటికి గుర్తించిన వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు సరిపడ వసతులు లేవని గుర్తించామన్నారు. పక్కనే వైటీసీ భవనం ఉందని పిల్లలను తాత్కలికంగా వసతి కల్పిస్తే ఇబ్బందులుండవని ఇక్కడి ప్రిన్సిపల్ తమ దృష్టికి తెచ్చారన్నారు. ఆ దిశగా జిల్లా ఉన్నతాధికారులకు డీఎల్‌ఎస్‌ఏ తరపున లేఖ రాస్తామన్నారు. పరిసరాలు, వంటశాల కూడా అపరిశుభ్రంగా ఉందని గుర్తించామన్నారు. పాముకాటుకు గురైన విద్యార్థి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ప్రిన్సిపల్ ద్వారా తెలిసిందని వెల్లడించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నేరడిగొండ

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్ఈఓ హరి కుమార్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని వాగ్ధారిలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లో దోమలు నిల్వ ఉండకుండా, వాడి పారేసినా కొబ్బరి బొండాలు, టైర్లు పాడైపోయిన డ్రమ్ములు పగిలిపోయిన చిన్న చిన్న వస్తువులు వాటిలో వర్షపు నీరు నిండి దోమలు వ్యాప్తి చెందడానికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ రవీందర్, ఎంఎల్‌హెచ్‌పీ వాణి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, ఏఎన్ఎం గంగామణి, శ్యామల, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్త వనిత పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన కలప పట్టివేత

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(కె) గ్రామంలో ఓ ఇంటి వెనుక భాగంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దుంగలను గురువారం భైంసా అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. అటవీ సెక్షన్ అధికారి ఇర్ఫానోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. పూర్తి సమాచారం మేరకు అటవీ శాఖ సిబ్బందితో కలిసి గ్రామంలో సోదాలు నిర్వహిస్తుండగా గ్రామానికి సమీపంలో ఉన్న ఓ ఇంటి వెనుక భాగంలో 30 టేకు దుంగలు లభించడంతో వాటిని స్వాధీన పర్చుకున్నట్టు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.17వేల 500 వరకు ఉంటుందని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ప్రాంతానికి తరలించినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా బీట్ అధికారి లెనిన్, నిర్మల్ టాస్క్‌ఫోర్స్ రేంజ్ అధికారి వేణుగోపాల్ అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

టూరిజం డెవలప్‌మెంట్ ఛైర్మన్‌ను కలిసిన మాజీ జెడ్పీటీసీ

నవతెలంగాణ-తలమడుగు

హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ ఛైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డిని గురువారం మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

పీహెచ్‌సీ ముందర నిరసన

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ముందు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో గురువారం పీహెచ్‌సీ వద్ద సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కుభీర్ మండల ఛైర్మెన్ డాక్టర్ సాప పండరి ఆధ్వర్యంలో యువకులతో కలిసి వరద నీటిలో వరి నాట్లు వేస్తు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రికి సంబంధించిన ఆవరణలో సిమెంట్ ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని, ఆస్పత్రి పక్కన చెత్తా చెదారంతో పాటు ప్రయివేటు వాహనాలను తొలగించి, ఆస్పత్రి ఆవరణలో పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన, వాతావరణం ఉండేట్లు తీర్చిదిద్దాలని అన్నారు. అనంతరం పీహెచ్‌సీ డాక్టర్ వడ్నం వసుంధరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్ రాధిక, ఫార్మసిస్ట్ సల్ల ఆనంద్, యువకులు బొమ్మడి మల్లేష్, రావుల సాయినాథ్, గాజుల దత్తాత్రి, ఠాకూర్ రాజు, రావుల సంటి, ధనగరి సాయినాథ్, దుర్గా సింగ్ పలువురు యువకులు పాల్గొన్నారు.

కేంద్రంపై ఆరోపణలు సరికాదు

నవతెలంగాణ-సారంగాపూర్

రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరుగ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేయకుండా, ప్రజలను ప్రక్కదోవ పట్టించేందుకు కేంద్ర బడ్జెట్ తెలంగాణకు నష్టం జరిగిందని ఆరోపణలు చేయడం సరైనది కాదని బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. గురువారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ ప్రజలను పక్కదారి పట్టించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతి ఒక పథకం తెలంగాణ ప్రజలకు దక్కడం జరుగుతుందని అన్నారు. ప్రతి దాంట్లో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములై రానున్న రోజుల్లో వికసిత్‌భారత్ లక్ష్యంగా ప్రజలను అభివృద్ధి చేయడం దేశాన్ని బలోపేతం చేయడమే మోడీ లక్ష్యమని వెల్లడించారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షులు కార్పే విలాస్, సీనియర్ నాయకులు వడ్డే రాజేందర్‌రెడ్డి, రాంశంకర్‌రెడ్డి, గంగారెడ్డి, చెన్నరాజేశ్వర్, బడి పోతన్న, సాహెబ్‌రావు, వీరయ్య, సాదు రాంరెడ్డి, కోరిపెల్లి రాజు, జీకే చాణక్య, కుమ్మరి వెంకటేష్, తిరుమల చారి, వినోద్ పాల్గొన్నారు.

గుంతల రోడ్డుపై నాట్లు వేసి నిరసన



నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రం నుంచి అష్ట వెళ్లే రోడ్డు గుంతలు మాయంగా మారడంతో గురువారం స్థానిక యువకులు రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు గుంతల్లో వర్షం నీరు చేరడంతో అటుగా రాక పోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖాధికారులు రోడ్డు బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ జానకి షర్మిల

నవతెలంగాణ-సారంగాపూర్

భారీ వర్షాల కారణంగా స్వర్ణ వాగు పరివాహక ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. మండలంలోని స్వర్ణ జలాశయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వస్తున్న నేపథ్యంలో ఒక గేటు ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. స్వర్ణ వాగు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె ప్రజలకు సూచించారు. ఏ ప్రమాదం సంభవించిన వెంటనే పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని అందుకు పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని వెల్లడించారు. వారి వెంట నీటిపారుదల శాఖ డీఈ దేవేందర్‌రెడ్డి, ఎస్సై శ్రీకాంత్, ప్రాజెక్ట్ సిబ్బంది ఉన్నారు.

అడెల్లి పోచమ్మకు జలాభిషేకం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన మహిళలు భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతతో పాటు అడెల్లి మహపోచమ్మకు వారం రోజుల పాటు గంగాజలాలతో అభిషేకం నిర్వహించారు. గురువారం సల్ల కుండలతో భాజా భజంత్రీలతో కాలినడకన అడెల్లి పోచమ్మ ఆలయానికి చేరుకొని, అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు అధికంగా పండాలని మొక్కుకున్నారు. అనంతరం ఆలయ సమీపంలో వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

- ఆరుగురు జూదరుల అరెస్టు

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని గిమ్మ గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై వి.పురుషోత్తం తమ సిబ్బందితో కలిసి దాడి చేయగా, పేకాట ఆడుతున్న నరేందర్, రమేష్, కిషన్, రామన్న, గౌరన్న, పరమేశ్వర్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, నగదు రూ.14వేల 580లనుసీజ్ చేయడం జరిగిందని తెలిపారు. మండలంలో ఎక్కడ పేకాట, మట్కా, గుట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాలకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అట్టి వారిపై ఉక్కుపాదం మోపాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ డి.సాయినాథ్ తెలిపారు. జైనథ్ ఎస్సై, సిబ్బంది సంతోష్, శివాజీలను అభినందించారు. మండలంలో ఎక్కడైనా పేకాట, మట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నట్లయితే సమాచారం సీఐ నెంబర్. 8712659916, జైనథ్ ఎస్సై నెంబర్ 8712659929లకు ఇవ్వవాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-నార్నూర్

ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందూ, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ సూచించారు. గురువారం మండలంలోని చోర్గావ్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం, జలుబు ఉన్న వారికి 50 మందికి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం గర్భిణులను పరీక్షించి, ఉచిత మందులు పంపిణీ చేశారు. వర్ష కాలం సమీపిస్తున్న తరుణంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి చుట్టూ పక్కన వర్షపు నీరు నిల్వ ఉండకుండా చుసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది గోకుల్, ఈశ్వరి, విద్యారాణి, అంగన్‌వాడీ టీచర్ పంచుబాయి ఆశా కార్యకర్త ఉన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఉట్నూర్

గత ఆదివారం 21న ఉట్నూర్ మండలంలోని గంగాపూర్ వాగులో గల్లంతైన యువకుడు టేకం లక్ష్మణ్ మృతదేహం గురువారం గంగాపూర్ వాగులో ఒక చెట్టు కొమ్మకు తట్టుకొని తేలుతూ లభ్యం అయింది. మృతదేహన్ని పోస్టుమార్టం చేసి, కుటుంబీకులకు అప్పగించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మనోహర్ తెలిపారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు

నవతెలంగాణ-నార్నూర్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో గురువారం మండలంలోని నాగల్‌కొండ గ్రామం గోండు గూడెంకు చెందిన కుర్సెంగా సీతారాం ఇల్లు కూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, బట్టలు వివిధ సామగ్రి నీటిలో ధ్వంసమయ్యాయి. దాదాపు రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు ఆదివాసీ నాయకులు ఆత్రం పరమేశ్వర్ పేర్కొన్నారు. బాధితునికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు, నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

బదిలీపై వెళుతున్న ప్రిన్సిపాల్‌కు సన్మానం

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని జామ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 8 సంవత్సరాలుగా ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన రమా కళ్యాణి బదిలీపై లక్సెట్టిపేట్ పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల పేరెంట్ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి, మెమోంటోను అందచేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఈసరి ప్రభాకర్, ఉపాధ్యక్షురాలు సుంకరి రాధ, కమిటీ సభ్యులు సొన్న పొశెట్టి, బొజన్న, రాము, జె.జాలం సింగ్, అశోక్, దేవేందర్, సుమన్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-బెజ్జూర్



సిర్పూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేసేలా చూడాలని కాంగ్రెస్ నాయకులు అర్షద్ హుస్సేన్, కౌటాల మాజీ ఎంపీపీ వసత్కార్ విశ్వనాథ్ కోరారు. గురువారం ఎమ్మెల్సీ దండే విఠల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలను విన్నవించారు. బెజ్జూర్ మండలంలోని కొత్తగూడ నుండి లుంబినాగర్ వరకు బీటీ, పెంచికల్‌పేట నుండి సలుగుపెల్లి వరకు, చింతలమానేపల్లి నుండి గూడెం గ్రామం వరకు, కౌటాల నుండి గుండాయిపేట వరకు, కౌటాల నుండి తుమ్మిడిహెటి వరకు, సిర్పూర్ నుండి చిలపెల్లి వరకు బీటీ రోడ్లను నిధులను మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ దండే విఠల్ సానుకూలంగా స్పందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జీ జిల్లా మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

నాణ్యత పాటించని బేకరీ సీజ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తినుబండారాల అమ్మకాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించని బేకరిని ఆసిఫాబాద్ మున్సిపాలిటీ అధికారులు సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ భుజంగరావు ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని జనకాపూర్‌లో దేవి స్వీట్ హౌస్‌ను అధికారులు తనిఖీ చేయగా తేదీ పూర్తయిన చిప్స్ ప్యాకెట్లతో పాటు ఇతర పదార్థాలు లభ్యం కావడంతో బేకరీని మూసివేసి రూ.6 వేల జరిమాన విధించినట్టు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని అనేక హోటళ్లు ఇతర పదార్థాలలో కనీస ప్రమాణాలు పాటించడం లేదని అధికారులు అన్ని దుకాణాలలో తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలల్లో శుభ్రత పాటించాలి

- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలలో శుభ్రత, నాణ్యత పాటించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి సూచించారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కుక్, కామాటీలకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో నాలుగవ తరగతి సిబ్బంది పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. వంటశాలలో ఈగలు, దోమలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో శుభ్రత లేకుంటే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు వంటశాలలు కూడా శుభ్రంగా ఉండాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులను తమ పిల్లల్లా చూడాలని సూచించారు. అప్పుడే వారికి నాణ్యమైన సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏటీడీఓలు క్షేత్రయ్య, ఖమ్రుద్దీన్, జీసీడీఓ శకుంతల, ఏసీఎంఓ ఉద్ధవ్, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, సనత్ కుమార్ శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీఆర్టీయూటీఎస్ సభ్యత్వం

నవతెలంగాణ-రెబ్బెన

పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కొనసాగుతోంది. గురువారం మండలంలోని తుంగెడ, గంగాపూర్, నంబాల గ్రామాల్లోని పాఠశాల్లో సంఘం బాధ్యులు చునర్కర్ అనిల్ కుమార్, భత్తుల సదానందం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టగా జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాసరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మహాకళ రాజా కమలాకర్ రెడ్డి హాజరై రశీదులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 317 ప్రభుత్వ ఉత్తర్వులు ఆధారంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల వివరాలను ప్రభుత్వ ఆదేశాలతో డీఈఓ సేకరిస్తున్నారన్నారు. జిల్లాలో దాదాపు 875 మంది ఉపాధ్యాయులు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులున్నారు. కమిటీలతో కాలయాపన చేయకుండా ఎన్నికల ముందు ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఎలాంటి షరతులు విధించకుండా స్థానికత ఆధారంగా 317 జీఓ ద్వారా వచ్చిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్, పురుషోత్తం, వినయ్ కుమార్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పద్మ, లింగన్న, రాజేందర్, సంపత్ కుమార్, సత్తయ్య, శివకుమార్, హిమబిందు, కవిత పాల్గొన్నారు.

కల్వర్టులపై పేరుపోయిన చెత్తా చెదారం తొలగింపు



నవతెలంగాణ-కెరమెరి

వారం రోజులుగా ఎడతెరపి లేని వర్షాలకు ఎస్సై గుంపుల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. గురువారం సిబ్బందితో కలిసి రాంపూర్, సాంగ్వి సమీపంలో కల్వర్టుపై పేరుకుపోయిన చెత్త చెదారాన్ని సాంగ్వి గ్రామ పంచాయతీ సహకారంతో పోలీసులు తొలగించారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాంపూర్, సాంగ్వి గ్రామాల కల్వర్టులపై పెద్ద ఎత్తున చెత్త చెదారం, బురద పేరుకుపోయింది. దీంతో పరిసర గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు వెళ్లలేని స్థితి నెలకొంది. ద్విచక్ర వాహన దారులు అదుపు తప్పి పడిపోతున్నారు. సమస్యను తెలుసుకున్న ఎస్సై చర్యలకు పూనుకున్నారు. జేసీబీ సాయం తో కల్వర్టులకు ఇరువైపుల పరిశుభ్రం చేశారు. కల్వర్టులు వద్ద బురద, చెత్త తొలగించి రాకపోకలు పునఃరుద్దరణతో ప్రయాణికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సాంగ్వి మాజీ సర్పంచ్ తొడసం జగన్నాథ్ రావు, ఏఎస్సై ఉల్లాస్ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌కు పక్కా భవనం నిర్మించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లోగల బీసీ ప్రిమెట్రిక్ బాలుర వసతి గృహానికి పక్కా భవనం నిర్మించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ అన్నారు. గురువారం హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు విద్యను అభ్యసించడానికి వేర్వేరు ప్రాంతాల నుండి వచ్చి హాస్టల్‌లో ఉంటున్నారన్నారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నాయకులు బొట్టుపల్లి సాయి కృష్ణ, పిప్పిరి సమన్న, సామాజిక కార్యకర్త కల్లూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

డిగ్రీలో చేరేందుకు 2 వరకు గడువు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇంటర్ ఉత్తీర్ణులై ఇప్పటి వరకు డిగ్రీలో చేరని విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి లక్ష్మీనరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. దోస్త్ ద్వారా విద్యార్థులు ఈ నెల 25 నుండి ఆగష్టు రెండో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన దోస్త్ సహాయక కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఫోన్ ద్వారా సంప్రదించాలనుకుంటే 7013607011, 9440194179 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

అధికారులను సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో ఇన్‌చార్జి డీఈ విధులు నిర్వహించి రెగ్యులర్ డీఈగా నియమితులైన కృష్ణను, అదే విభాగంలో ఏఈగా పనిచేసి బదిలీపై వెళ్తున్న రామ్ కిరణ్‌ను బీఆర్ఎస్ జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలు కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జాబరే రవీందర్, మాజీ సర్పంచులు భీమేష్, వినోద్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నాయకులు లక్ష్మణ్, బండి సాయి పాల్గొన్నారు.

మురుగు నీళ్ల మధ్యే సహవాసం

- ద్వీపాన్ని తలపిస్తున్న కాపువాడ
- అయినా అధికారులలో కానరాని చలనం



రోడ్డుపై మోకాలు లోతులో నిలిచిన వరద నీరు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ ఫోటోలు చూశారుగా.. ఇవి ఎక్కడో చెరువు ఫోటోలు అనుకుంటే పొరపాటే. ఇది సాక్షాత్తు కాగజ్‌నగర్ పట్టణానికి నడిబొడ్డున ఉన్న కాపువాడ దుస్థితి. ఈ కాలనీవాసులు గత నాలుగు రోజులుగా చుట్టూ వర్షపు నీటి మధ్య ఇళ్లల్లో బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. కాపువాడలో ఐటీఐ కళాశాల సమీపంలోని కాలనీ చుట్టూ వర్షపు నీరు నిలిచి ఉంది. సుమారు పది ఇండ్లు ఈ వరద నీటిలో మునిగి ఉన్నాయి. వీరు ప్రస్తుతం ఈ వరద నీటి గుండానే ప్రయణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని మురుగు కాలువల గుండా ప్రవహిస్తున్న మురుగు నీటితో పాటు వరద నీరంతా ఈ ఇళ్ల చుట్టూ చేరింది. మంచినీటి బావి కూడా ఈ మురుగు నీటిలో మునిగిపోయి ఉంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణం ఇంజనీరింగ్ అధికారుల వైఫల్యమే. ఎందుకంటే ఈ కాలనీలో సీసీ రోడ్డు, మురుగు కాలువలు నిర్మించారు. కాని కాలువల నీరు ఎటు వైపు వెళ్లాలో తెలియకుండా వీటిని నిర్మించారు. కాలనీకి చుట్టూ కాలువలను తీసుకువచ్చి అర్ధాంతరంగానే వదిలేశారు. దీనితో కాలనీలోని ఇతరుల ఇళ్ల నుండి వచ్చే మురుగు నీటితో పాటు వరద నీరు ఇక్కడికి వచ్చి ఇళ్లను ముంచేసింది. దీనిపై నాలుగు రోజుల నుండి కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు చెప్పినా ఫలితం లేదు. తూతూ మంత్రంగా ఒక రోజు వచ్చి మోటారు సాయంతో నీటిని తరలించే ప్రయత్నం చేశారు. కానీ అది సాధ్యం కాకపోవడంతో వదిలేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ సమస్యకు పరిష్కారం ఏంటని కాలనీవాసులు వాపోతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ అంజయ్యను వివరణ కోరే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

మాదకద్రవ్యాలు నియంత్రణకు కృషి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణపై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా అటువంటివి కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డీవైఎఫ్ఐ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై యువతకు అవగాహన కల్పించే ఉద్దేశంతో వాటిని పూర్తిగా నివారించడమే లక్ష్యంగా, మాదకద్రవ్యాలను అరికడదాం సమాజాన్ని కాపాడదాం అనే నినాదంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గంజాయి లాంటి వాటికి యువత బానిసైతే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు తాము చేస్తున్న పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కోరంగి మాలశ్రీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జాదోవ్ రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గేడం టీకానంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి, దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శులు వడ్లూరి శ్రీకాంత్, ఆత్మకూరి సతీష్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

షేర్ మార్కెట్ పేరుతో మోసం

- రూ.20 లక్షల వరకు నష్టపోయిన యువత

నవతెలంగాణ-బెజ్జూర్

డాటా మీర్ యాప్‌లో షేర్ మార్కెట్‌కు పెట్టుబడి పెడితే డబ్బులు సంపాదించుకోవచ్చని యువకులకు ఆశ చూపించి కుచ్చుటోపి పెట్టిన డాటా మీర్ యాప్ బాగోతం బెజ్జూర్‌లో బట్టబయలైంది. కొన్ని సంవత్సరాల నుండి ఈ యాప్ ద్వారా పెట్టుబడి పెడుతున్నామని ఎక్కువ లాభాలు వచ్చాయని కొందరు వ్యక్తులు ఆశ చూపించడంతో ఆశలో పడ్డ యువత ఈ యాప్ ద్వారా మండలంలోని కుకుడ, సలుగుపల్లి, బెజ్జూర్ తదితర గ్రామాలకు చెందిన వ్యక్తులు సుమారు రూ.20 లక్షల వరకు డబ్బులు జమ చేశారు. డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతో మోసపోయామని గమనించిన యువత లబోదిబోమంటున్నారు. ఆదివారం రూ.లక్ష పెట్టుబడి పెడితే ఒక్కరోజులోనే మరో రూ.లక్ష కలిపి ఇస్తామని ఆశ చూపించడంతో దీనికి ఆకర్షితులైన కొంతమంది రూ.లక్షలు ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టారు. మరునాడే డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతో మోసపోయామని గమనించారు. కుకుడలో సుమారు 20 మంది, బెజ్జూర్‌లో పదిమంది, సలుగుపల్లిలో పదిమంది యువకులు ఈ ఉచ్చులో చిక్కుకొని నష్టపోయినట్లు తెలుస్తోంది. తమకు న్యాయం చేయాలని గురువారం కొంతమంది సైబర్ క్రైమ్‌ను ఆశ్రయించినట్లు తెలిసింది. ఇలాంటి ఉచ్చులో చిక్కుకోవద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఎక్కువ డబ్బులు వస్తాయని యువత ఈ ఉచ్చులో చిక్కుకొని నష్టపోయారు. కొందరు వ్యక్తులు బంగారాన్ని సైతం అమ్ముకొని దీంట్లో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది.

నాటిన ప్రతి మొక్క బతికేలా చూడాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే
- ఖైరిగూడలో వృక్షరోపన్ అభియాన్



మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, సింగరేణి జీఎం రవి

నవతెలంగాణ-రెబ్బెన

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్క బతికేలా చూడాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి ఆధ్వర్యంలో వృక్షరోపన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించగా కలెక్టర్ జీఎం డి.రవి ప్రసాద్, ఎస్పీ డీవీ. శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్‌తో పాల్గొని మొక్కలు నాటారు. ఒక్కరోజే ఏరియాలో 20 వేల మొక్కలు నాటారు. 5 వేల మొక్కలను పంపిణీ చేశారు. కాగా గతంలో సింగరేణి ఆధ్వర్యంలో నాటిన మొక్కలు, ఎదిగిన వృక్షాల వివరాలను కలెక్టర్‌కు జీఎం వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యానికి మొక్కలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఎస్ఓ టూ జీఎం ఎం.నరేందర్, సీఎంఓఏఐ అధ్యక్షులు టి.మధుసూదన్, ఖైరిగూడ పీఓ ఎస్ సత్యనారాయణ, ఎస్ ఉమాకాంత్ పాల్గొన్నారు.

వ్యవసాయ బావులతో రైతులకు మేలు

నవతెలంగాణ-కెరమెరి

వ్యవసాయ అనుసంధాన బావులతో రైతులకు మేలు జరుగుతుందని ఏపీఓ మల్లయ్య అన్నారు. గురువారం మండలంలోని పరంధోలి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన వ్యవసాయ అనుసంధాన బావులను పరిశీలించారు. దీంట్లో భాగంగా ఈజీఎస్ సిబ్బంది కొలతలు చేపట్టారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ వ్యవసాయ బావుల నిర్మాణం పూర్తయిందన్నారు. ఉపాధి హామీ పథకంలో ఆసక్తి కలిగిన రైతులకు ఓపెన్ బావులను మంజూరు చేసినట్లు తెలిపారు. పొలాల్లో నిర్మించుకున్న బావులను పూర్తి స్థాయిలో వ్యవసాయానికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్కో దానికి రూ. 4.20 లక్షల నిధులు మంజూరైట్లు తెలిపారు. వ్యవసాయ అనుసంధాన బావులతో రైతులు మూడు కాలాల పాటు వివిధ రకాల పంటలను పండించుకొని ఆర్థిక అభివృద్ధి చెందవచ్చని పేర్కొన్నారు. ఏపీఓతో పాటు ఈసీ అభ్యా నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్, రైతులు కాంబ్లే లక్ష్మణ్ ఉన్నారు.



ఓపెన్ వర్సిటీ విద్యార్థులకు కౌన్సెలింగ్ తరగతులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023-24 విద్యాసంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీలో అడ్మిషన్ తీసుకున్న ప్రథమ సంవత్సరం సెమిస్టర్-2 విద్యార్థులకు కాంట్రాక్టు, కౌన్సిలింగ్ తరగతులను నిర్వహించనున్నట్లు స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28, ఆగష్టు 4, 10, 11, 18 తేదీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ తరగతులు నిర్వహించబడుతాయని వివరించారు. ఇతర వివరాలకు 9866398678, 9494314314 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అడ ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఏడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో జిల్లాలోని కుమురం భీం అడ ప్రాజెక్ట్ రెండు గేట్లు ఎత్తి రెండు రోజులు నుండి నిరంతరాయంగా నీటిని విడుదల చేస్తున్న అధికారులు పరివాహక ప్రాంతాల్లో గురువారం వర్షం ఎక్కువగా నమోదు కావడంతో రాత్రి 10 గంటలకు మూడు గేట్లు ఎత్తనున్నట్లు ప్రకటించారు. గురువారం రాత్రి 10 గంటలకు గంటలకు వీటిలో 4, 5 మరియు 6 గేట్లు 0.60 మీటర్ మేర ఎత్తి 3876 క్యూసెక్కుల నీటిని కిందికి వదలనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం 243 మీటర్లు కాగా గురువారం రాత్రి నాటికి 237.800 మీటర్లకు చేరుకుంటుందని, ప్రాజెక్టు సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా ఇప్పటివరకు 5.872 టీఎంసీలకు చేరుకుంది. ఇన్ ఫ్లో 3560 క్యూసెక్కులుగా ఉందని, దీంతో 3 గేట్లు ఎత్తి 3876 క్యూసెక్కుల నీటిని కిందికి వదులనున్నట్లు, ప్రాజెక్టు కింద ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

పురుగులమందు తాగి యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-కౌటాల



పురుగుమందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తుమ్మిహెట్టిలో జరిగింది. కౌటాల ఎస్సై మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పోరెత్ అశ్విని(21) వారం రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతుంది. తండ్రి మారుతి ఆస్పత్రికి వెల్లుదామంటె కూతురు రానని చెప్పడంతో చెట్ల మందులు ఇప్పించారు. వాటితో తగ్గిందని చెప్పిడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఇంట్లో ఉంచి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఈ నెల18న ఎవరు లేని సమయంలో ఉదయం పది గంటల ప్రాంతంలో పురుగులమందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉంది. ఈ విషయం పక్క ఇంటి వారు చూసి చేనులో పనిలో చేస్తున్న తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే తల్లిదండ్రులు ఇంటికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న అశ్వినిని కౌటాల ప్రయివేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం చనిపోయింది. తండ్రి మారుతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధూకర్ తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్లో జిల్లాకు మొండిచేయి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండి చేయి చూపారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాకు ప్రాణాధారమైన ప్రాణహిత చేవేళ్ల, అడ ప్రాజెక్టుతో పాటు ఇతర ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం అధికార పార్టీకి జిల్లాపై ఉన్న ప్రేమను తెలిసేలా చేస్తుందన్నారు. నీతి అయోగ్‌లో ఆస్పిరేషన్ జిల్లాగా ఎన్నికైన జిల్లాను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వ్యవసాయానికి రూ. 72 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో చూపారని అయితే ఫసల్ బీమా యోజన ప్రీమియంకు ఎంత చెల్లిస్తున్నారనే విషయం ఎందుకు చెప్పాలేదన్నారు. గాంధీ కుటుంబాన్ని ఆకట్టుకునేలా మాత్రమే బడ్జెట్ ఉందని, ఇది కేవలం అంకెల గారడి మాత్రమే అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వివిధ రకాల పథకాల ద్వారా రూ.70 వేల కోట్లను కేంద్రం నుండి రాష్ట్రానికి రానున్నట్లు తెలిపారు. పేదలకు ఇంటి నిర్మాణం కోసం చేసే ఖర్చులకు సంబంధించి చెల్లింపులు చూపలేదన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయలేదని, పెంచిన టారిఫ్ ప్రస్తావించలేదన్నారు. బడ్జెట్ విధానాలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు కోట్నాక విజయ్, చర్ల మురళి, అరిగెల మల్లికార్జున్, సత్యనారాయణ, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందుతున్న సేఫ్టీ జీఎంకు సన్మానం



నవతెలంగాణ-రెబ్బెన

జులైలో ఉద్యోగ విరమణ పొందుతున్న సేఫ్టీ జీఎం(కార్పొరేట్) కె గురవయ్యను జీఎం డి.రవిప్రసాద్ బెల్లంపల్లి ఏరియా అధికారులతో కలిసి సన్మానించారు. పూల మొక్కను అందించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా జీఎం(కార్పొరేట్) గురవయ్య మాట్లాడుతూ 42 ఏండ్లలో సింగరేణిలో వచ్చిన సాంకేతికత, రక్షణపై తీసుకున్న చర్యలు, ఉద్యోగుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఎస్ఓ టూ జీఎం మచ్చగిరి నరేందర్, ఖైరిగూడ పీఓ ఎంహెచ్‌జడ్ సత్యనారాయణ, పీఓ ఎన్.ఉమాకాంత్, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఆగస్టు 7 జాతీయ ఓబీసీ మహాసభ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆగస్టు 7న పంజాబ్ రాష్ట్రం అమృత్ సర్ గురునానక్ యూనివర్సిటీలోని గోల్డెన్ జూబ్లీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రూప్నర్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల రక్షణ కోసం నిర్వహించే తొమ్మిదవ జాతీయ మహాసభను విజయవంతం చేయాలన్నారు. బీసీల ఐక్యతను చాటే విధంగా నిర్వహిస్తున్న మహాసభ అవుతున్నందున బీసీలు జిల్లా నుండి పెద్ద ఎత్తున శ్రేణులు కదలి రావాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం బాలేష్, ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, జిల్లా రైతు అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్, జిల్లా మహిళా అధ్యక్షురాలు దిగాధేతుల రాధిక, ప్రధాన కార్యదర్శి నాగుల సుప్రజ, మండలాధ్యక్షురాలు లలిత, బీసీ యువజన సంఘం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు బొట్టుపల్లి ప్రశాంత్, మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగోశే శంకర్, సంఘ సభ్యులు రవికాంత్, శ్రీనివాస్ చారి, బలరాం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓగా డాక్టర్ సిద్ధార్థ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిప్యూటీ జిల్లా వైద్యాధికారిగా డాక్టర్ సిద్దార్థకు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా వైద్యాధికారి తుకారం బట్ ఉత్తర్వుల ప్రతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసుకున్న బాధ్యతలకు న్యాయం చేసేలా పనిచేయాలన్నారు. ప్రజలకు వైద్యశాఖ అవసరం ఎంతో ఉంటుందని వారి అవసరాన్ని తీర్చే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీఎస్ఓ రమేష్ చంద్ర, పీహెచ్ఎన్ నరసమ్మ, హెచ్ఇఓ శ్యామ్ లాల్, సీనియర్ అసిస్టెంట్ గోపి, జూనియర్ అసిస్టెంట్ తుకారం, స్రవంతి, సాయి కుమార్, మణికాంత్ రతన్, ఎపిడమాలజిస్ట్ ప్రశాంత్, డీడీఎం శ్రీకాంత్, ఎన్‌హెచ్ఎం ప్రవీణ్, డీఈఓలు ప్రశాంత్, శివ, షకీల్, వెంకటేష్, క్వాలిటీ మేనేజర్ సాయి కుమార్, అశోక్, మతిన్, ఫాతిమా పాల్గొన్నారు.



వృత్తి శిక్షణ ధ్రువపత్రాలు అందజేత

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి సేవా సమితి ఎస్టీపీపీ ద్వార టైలరింగ్ కోర్సు 2023-24 సంవత్సరంలో శిక్షణ పొందిన మహిళలకు సింగరేణి సేవా భవన్ ఎస్టీపీపీలో గురువారం ధ్రువపత్రాలు అందజేశారు. ఖాదీ గ్రామోద్యోగ్ హైదరాబాద్ వారిచే సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ శివకుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన పరిక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మహిళలకు ఖాదీ గ్రామోద్యోగ సంస్థ ద్వార శిక్షణ పొందినట్లు ధ్రువపత్రాలు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పరీక్షల నిర్వాహణలో ఎస్టీపీపీ పర్సనల్ మేనేజర్ రామశాస్త్రీ, టైలరింగ్ శిక్షకురాలు రఫీయా, సేవా సమితి కోఆర్డినేటర్ అరుణ పాల్గొన్నారు.

దారి లేక సుదూర ప్రాంతానికి గర్భిణీ తరలింపు

నవతెలంగాణ-వేమనపల్లి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లేందుకు దారి లేక దూర ప్రాంతానికి నిండు గర్భిణీ తరలించిన సంఘటన వేమనపల్లిలో చోటు చేసుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షానికి ప్రాణహిత నది వరదతో సుంపుటం రహదారి నీట మునిగింది. జాజులపేట గ్రామానికి చెందిన దస్నూరి భారతి అనే నిండు గర్భిణిని ముందు జాగ్రత్త చర్యగా 108 వాహనం ద్వారా చెన్నూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. భారతికి ఆగస్టు మొదటి వారంలో డెలివరీ ఉండడంతో ముందస్తుగా చెన్నూర్ అస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్, హెల్త్ అసిస్టెంట్ రాంశెట్టి బాపు, ఆశా కార్యకర్త శారద 108 ఈఎంటీ పి రమేష్, పైలెట్ ఇమామ్ షరీఫ్ పాల్గొన్నారు.

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-వేమనపల్లి



గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపారు. ఎగువన కురుస్తున్నవర్షాలకు ప్రాణహిత నదికి వరద వచ్చి చేరింది. వరద వల్ల వేమనపల్లి-కల్లంపల్లి, ముల్కలపేట-రాచర్ల రహదారులు మూసి వేసినట్లు తెలిపారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దోని అన్నారు. ముసురు వర్షాల వల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, పాత ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న నివాసల్లో ఉండే వారు కూడా అప్రమత్తంగా ఉండాలని, విస్తృతంగా వర్షాలు కురుస్తునందన వాగులు పొంగే రహదారుల్లో ప్రయాణాలు మానుకోవాలన్నారు. వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడ గ్రామ ప్రజలు పోలీసులకు తెలియ జేయాలన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 లేదా 8712656557 నంబరును సంప్రదించాలని సూచించారు.

గల్ఫ్ కార్మికుల పట్ల ప్రభుత్వాల చిన్న చూపు



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల మెండిచేయి, ఒక్క రూపాయి కూడా గల్ఫ్ కార్మికులకు కేటాయించక పోవడం చాల బాధాకరమని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య ఆవేదన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వంలా కాకుండా అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక నిధి సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని నమ్మితే నిరాశ ఎదురైందని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా ఆనాడు చెప్పిన అలాగే గత ఏప్రిల్ 16, 2024న హైదరాబాద్‌లో దక్కన్ హోతల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి మా గల్ఫ్ సంఘాల సమావేశంలో ఇచ్చినమాటలు అమలు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరం నడుస్తున్న గల్ఫ్ కార్మికుల జీవితాల్లో మారుపురాలేదని, వలసలు ఆగుతాయి అనుకుంటే రెండింతలు పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ సంఘ నాయకులు మల్లికార్జున్ తిరుపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్కే-5 గని ఆవరణలో వన మహోత్సవం

నవతెలంగాణ-నస్పూర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-5 గని ఆవరణలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి గురువారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక వృక్షారోపన్ అభియాన్ 2024లో భాగంగా కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి దేశవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ధన్ బాద్ నుంచి ప్రారంభించగా, రాష్ట్ర ప్రభుత్వం సైతం 75వ వనమహోత్సవం కార్యక్రమాన్ని తెలంగాణ వ్యాప్తంగా చేపడుతుందన్నారు. శ్రీరాంపూర్ సింగరేణి కార్యక్రమంలో భాగంగా ఈసారి ఏరియా వ్యాప్తంగా 20,750 మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, అందులో భాగంగా 7,200 మొక్కలు శ్రీరాంపూర్ పరిసర ప్రాంతాల వారికి పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు రాధా కుమారి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, ఆర్కె 5, 6 గ్రూప్ గనుల ఏజెంట్ ఏవీ రెడ్డి, ఆర్కె-7 గ్రూప్ గనుల ఏజెంట్ రాముడు పాల్గొన్నారు.

విధిగా రైతుభీమా నమోదు చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి కల్పన

నవతెలంగాణ-హాజీపూర్

18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల ప్రతీ రైతు రైతుభీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆగస్టు 8వ తేదీలోగా జిల్లా వ్యాప్తంగా రైతువేదికల్లో అందుబాటులో ఉండే వ్యవసాయ విస్తరణాధికారి(ఏఈఓ) వద్ద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కల్పన తెలిపారు. గురువారం మండలంలోని గుడిపేట రైతువేదికను సందర్శించి రికార్డులను పరిశీలించి రైతుభీమా, రుణమాఫీ కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం కల్పన మాట్లాడుతూ, రైతుభీమా కోసం దరఖాస్తుతో పాటు రైతుపట్టా పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను అందజేసి రైతుభీమా చేసుకోవాలన్నారు. అనివార్య కారణాల వలన రైతు మరణిస్తే ఆ రైతు నామినీ బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షలు జమ చేయబడుతాయని అన్నారు. పంట రుణమాఫీ సమాచారం కోసం రైతులు తమ ఆధార్ కార్డు నంబర్ ఆన్‌లైన్‌లో పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఎలాంటి సందేహాలు ఉన్నా రైతువేదికలో ఉండే ఏఈఓలు నివృత్తి చేస్తారని అన్నారు.

ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు కిరాణా షాపుల్లో టాస్క్ ఫోర్స్, ఎక్సైజ్ పోలీసులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. కిరాణా దుకాణాల్లో బెల్లం, పటిక అమ్మకూడదని హెచ్చరించారు. పటిక బెల్లం అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తినే బెల్లం లిమిట్ ప్రకారమే షాపుల్లో ఉంచుకోవాలని సూచించారు. ఎక్సైజ్ ఉమ్మడి జిల్లా స్పెషల్ ఫోర్స్ గంగారెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బుక్కులు పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలోని ఏకలవ్య ఆశ్రమంలోని గురువారం మమత నరంగిణి గ్రూప్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్కులు పెన్నులు అందజేశారు. ఆశ్రమంలో చదువుకునే సుమారు 40 మంది పిల్లలు బుక్కులు, పెన్నులు అందించినట్లు గ్రూప్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మంజుల, లత, నాగమణి, జ్యోష్న, చంద్రదత్ పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్

- పట్టించుకోని అధికారులు
- వరంలో రెండవసారి ఘటన

నవతెలంగాణ-హాజీపూర్



అందలంలోని గుడిపేట అర్ అండ్ అర్ కాలనీ 60 ఫీట్ల రోడ్డు వద్ద హై వే రోడ్డు పక్కన మిషన్ భగీరథ మెయిన్ పైప్ లైన్ పగిలిపోయింది. ఆయగ్రామల ట్యాంక్‌లకు నీటిని సరఫరా చేసే పైప్ లైన్ పగిలి పోవడంతో నీరంతా వృథాగా పోతోంది. సంబధిత అధికారులు మాత్రం వారికి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గత వారం రోజుల క్రితమే పగిలినా కానీ అప్పుడు తూ తూ మంత్రంగా సరిచేసి వెళ్ళిపోయారు. గతంలో పగిలిన సమయంలో పదుల సంఖ్యలో ఫిర్యాదులు చేస్తే కాని సంబధిత అధికారులు స్పందించలేదు. 4 రోజుల క్రితం అదేచోట గురువారం సాయంత్రం మళ్ళీ పగిలి పోయింది. ఇలా తరచూ మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలి పోవడం పరిపాటిగా మారింది.

కానరాని మిషన్ భగీరథ అధికారులు.

మిషన్ భగీరథ అధికారులపై మొదటి నుండి విమర్శలు వస్తున్నాయి. వేళల్లో జీతాలు తీసుకుంటూ కనీసం కూడా సంబధిత పనులపై దృష్టి సారించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఎల్లంపల్లి వద్ద ఏర్పాటైన పంప్ హౌస్‌కు కేవలం కూత వేటు దూరంలో పైప్ లైన్ పగిలినా.. రోజుల తరబడి స్పందించక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు విధులు పక్కకు పెట్టి ఇతర వ్యపాకాలపై దృష్టి సరిస్తున్నట్లు పలు సంఘటనలు గుర్తుచేస్తున్నాయి. కొందరు అధికారులు కలిసి గతంలో బినామీ పేర్లతో వైన్ షాప్ టెండర్లు దక్కించుకొని ఆ షాప్‌ల ముందు సెల్ఫీ పైన్ట్ పెట్టడం వైరల్ అయింది. ఆ సమయంలో ఉన్నతాధికారుల నుంచి మొట్టికాయలు పడ్డా కానీ వారిలో ఎలాంటి చలనం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో పెద్ద గ్రామ పంచాయతీ అయిన గుడిపేట్‌లో తరచూ ఇలాంటి ప్రాబ్లమ్స్ రావడంపై వారి నిర్లక్ష్యం కారణంగా పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జైపూర్ ఎస్టీపీపీ జనరల్ మేనేజర్ శ్రీనివాసులు



నవతెలంగాణ-జైపూర్

పర్యావరణాన్ని పరిరక్షించుకోడం కోసం పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరమని జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎస్టీపీపీ ట్రైమ్ ఆఫీస్ పరిసరాల్లో ఎస్టీపీపీ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వృక్షారోహన్-2024, వన మహోత్సవం కార్యక్రమాన్ని జరుపుకున్నారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు బొగ్గు ఉత్పత్తి చేస్తున్న క్రమంలో పర్యవరణానికి కలిగే హాని తగ్గించుకోవడం కోసం విరివిరిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. వ్యక్తిగతమైన ప్రత్యేక రోజుల సందర్భంగా ప్రతి ఒక్కరు ఒక చెట్టు నాటడం అలవాటు చేసుకోవాలని అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎస్టీపీపీ సందర్శించిన సీఐఎస్ఎఫ్ ఐజీ ఎస్ఆర్ శరవణన్ చెట్లు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ యోగేష్ పర్మార్, సీఎంఓ ఏఐ ప్రసిడెంట్ (ఎస్టీపీపీ) సముద్రాల శ్రీనివాస్, ఏఐటీయూసీ అసిస్టెంట్ పిట్ కార్యదర్శి పర్యయ్య, ఏజీఎం (సివిల్ కేఎస్ఎన్) ప్రసాద్, ఏజీఎం (ఫైనాన్స్) సుధాకర్, ఏజీఎం (ఎఫ్‌జీడీ) మదన్ మోహన్, పీఎంపీఎల్ ప్లాంట్ హెడ్ అఖిల్‌కపూర్, డీజీఎం (ఎన్విరాన్మెంట్) వాసుదేవ మూర్తి, మేనేజర్ (ఫారెస్ట్) చంద్రమణి, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-తాండూర్

పీఆర్‌టీయూటీఎస్ తాండూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంబరం శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంచిర్యాల జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి కొట్టే శంకర్ హాజరై మాట్లాడారు. ఏకీకృత సర్వీసు సాధించిన ఉపాధ్యాయులకు జేఎల్ డిప్యూటీ డీఈ, ఏడీలుగా అందరూ ఉపాధ్యాయులకు సమానంగా పదోన్నతులు పొందడానికి అవకాశం కలిగే విధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్నటువంటి ఐదు డీఏలలో మూడు డీఏలను ఇప్పిచ్చే విధంగా కృషి చేస్తామని, పీఆర్సీ ఫిట్మెంటు 35 శాతం పెంచే విధంగా, నగదు రహిత హెల్త్ కార్డులను ఇప్పించి అన్ని కార్పొరేట్ హాస్పిటల్‌లో వైద్యం అందే విధంగా పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు.

జన్నారం : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు చేస్తున్నామని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి అన్నారు.





పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా కమిటీల ఆదేశాల మేరకు గురువారం జన్నారం మండలం కిష్టాపూర్ జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులకు పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్డులను అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్‌టీయూటీఎస్ సంఘం ఉపాధ్యాయుల సమస్యల సాధనలో ముందుంటుందని, పండిట్ అప్‌గ్రేడేషన్, పీఈటీ అప్‌గ్రేడేషన్‌లో సంఘం ఎంతో కృషి చేసిందని, 317 బాధితుల సమస్యలు త్వరలో పరిష్కరించబడతాయని దీనికోసం ముఖ్యమంత్రితో రాష్ట్ర నాయకులు ఎమ్మెల్సీ, జిల్లా నాయకులు కలిశారని తెలిపారు. ప్రతి ప్రైమరీ స్కూల్‌కు పిఎస్ హెచ్‌ఎం పోస్ట్ మంజూరు అయ్యేవిధంగా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించినట్లు పేర్కొన్నారు. త్వరలో 4 డీఏ లతోపాటు మంచి పీఆర్సీ కోసం పీఆర్టీయూ రాష్ట్ర నాయకత్వం ఎమ్మెల్సీ కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి, నగురు సత్యనారాయణ రాష్ట్ర నాయకులు పిట్ట రాజారావు, జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్ కుమార్ పాల్గొన్నారు.

ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై ఏది..?

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. సింగరేణి యాజమాన్యం ఇటీవల రక్షణతో కూడిన ఉత్పత్తిని తీయాలని పదే పదే చెబుతూ కార్మికులకు క్రమశిక్షణ చర్యలలో భాగంగా ఎల్లో కార్డు, రెడ్ కార్డు అంటూ వారి సెల్‌ఫోన్‌లకు సమాచారం పంపుతున్నారు. కానీ తాము నిర్వహించాల్సిన బాధ్యత పట్ల అలసత్వం వహిస్తున్నారని చెప్పవచ్చు. ఇటీవల గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎస్ఆర్పి-1 గనిపై ఎప్పుడో సర్దార్లకు నిర్మించిన రెస్ట్ హాలు రేకులు పలిగి వర్షం కురుస్తున్న, అలాగే షిఫ్ట్ సమయాల్లో అందరూ కలిసి కూర్చుని టిఫిన్, ఛాయ్ తాగే క్యాంటీన్లో రేకుపగిలి వర్షం పడుతున్న ఎవరు పట్టించుకోకపోవడంతో కార్మికులు ఎవరికీ ఎల్లో కార్డు ఇవ్వాలని అంటున్నారు. అంతే కాకుండా గోడలు పదునెక్కి కరెంట్ స్విచ్ బోర్డులు తడుస్తున్నాయని, ప్రమాదం జరిగితే కానీ అధికారులు స్పందించరా అని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం గనులపైన పాతకాలం నాటి షెడ్లను పర్యవేక్షించి తగు చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.





నంనూర్‌లో ఘనంగా వనమహోత్సవం

నవతెలంగాణ-హజీపూర్

వన మహోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని నంనూర్ గ్రామంలోని చందనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విస్తృతంగా మొక్కలు నాటారు. ఓ వైపు వర్షం కురుస్తుండగానే అంతా మొక్కలు నాటగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూధన్, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, టీఏ వేణుగోపాల్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సత్యవతి, పాఠశాల సిబ్బంది పాల్గొని పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన కలప పట్టివేత



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిస్టాపూర్ గ్రామంలో గురువారం అటవీ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన మల్లేశ్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు స్వాధీనం చేసుకున్నట్లు జన్నారం ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు తెలిపారు. పట్టుకున్న రెండు, టేకు దుంగలు నాలుగు చెక్కల విలువ రూ.8,463 ఉంటుందన్నారు. అతడిపై కేసు నమోదు చేసి కలపను జన్నారం అటవీ రేంజ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో డిప్యూటీ అధికారి మమత, ఎఫ్ఎస్ఓలు కిరణ్మయి, ప్రవంతి, జ్యోతి పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసిన మహిళలకు రాతపరీక్ష

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో వృత్తి శిక్షణ కోర్సులలో శిక్షణ తీసుకున్న మహిళా అభ్యర్థులకు గురువారం శ్రీరాంపూర్ కాలనీలోని సీఈఆర్‌లో రాత పరీక్ష నిర్వహించారు. వృత్తి శిక్షణ తీసుకున్న మహిళలు 477 మందికి గాను 362 మంది రాత పరీక్షలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి పాల్గొని మాట్లాడుతూ మహిళలు అధిక సంఖ్యలో వృత్తి శిక్షణ కోర్సులను నేర్చుకొని పరీక్ష రాయడానికి వచ్చిన వారందరికీ అభినందించారు. వారు నేర్చుకున్న కోర్సులలో వారి నైపుణ్యం పరీక్షల ద్వారా తెలుస్తుందని, మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడడానికి ఉపయోగ పడుతాయని, అలాగే వారు ఉపాధి పొంది నలుగురికి ఉపాధి కల్పించాలని కోరారు. మహిళలు ఆసక్తితో 2024-25 ఆర్థిక సంవత్సరంలో కూడా సేవా సమితి ద్వారా వివిధ కోర్సులను నేర్చుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు రీజినల్ అధికారి జె అనసూయ, సీనియర్ పిఓ పి కాంతారావు, సింగరేణి సేవా సమితి చీఫ్ కోఆర్డినేటర్ హైదరాబాద్ డీఎస్ శివకుమార్, ఖాదీ గ్రామ ఉద్యోగ్ ఆఫీసర్ హైదరాబాద్ బానోతు నరేష్, సేవా సెక్రటరీ కొట్టే జ్యోతి శిక్షకురాళ్ళు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వాహణకు ప్రణాళిక సిద్ధం చేయాలి

- ఎంపీడీఓ, ఎంపీఓలను ఆదేశించిన జిల్లా అధికారులు

నవతెలంగాణ-జైపూర్

2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టాల్సిన నర్సరీల నిర్వాహణకు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా అధికారులు ఆదేశించినట్లు స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు.. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓలతో ఏర్పాటు చేసిన గూగుల్ మీట్ ద్వార నర్సరీల్లో జర్మినేషన్ లేనటువంటి బెడ్స్ గుర్తించి ఇతర జాతుల మొక్కలు ఈత, వెదురు, నీలగిరి, ఖర్జూర విత్తనాలు నాటించేందుకు వారం రోజుల్లో సిద్ధం కావాలని కోరారు. ఎదుగుదలకు నోచుకోని మొక్కలు ఏపుగా పెంచడం కోసం ప్రయత్నిస్తూ వారం రోజుల్లో పని ప్రదేశాలను గుర్తించి గుంతలు తవ్వి మొక్కలు నాటించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో వన మహోత్సవం జరుపుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి 6 మొక్కలు పంపిణీ చేయాలన్నారు. వీటికి సంబంధించిన రికార్డులు సిద్ధం చేసుకోవాలని, జిల్లా కలెక్టర్ పరిశీలించే అవకాశమున్నందున గ్రామ పంచాయతీల్లో రికార్డులు ప్రణాళికా బద్ధంగా బద్రం చేయాలని తెలిపారు. పంపిణీ చేసిన మొక్కల వివరాలు, పంపిణీ చేసిన మొక్కల జాతులకు సంబంధించిన వివరాలు రికార్డుల్లో పొందుపర్చాలని సూచించారు.

ఇన్కమ్ టాక్స్ బోగస్ క్లైయిమ్స్‌పై అధికారులకు అవగాహన



నవతెలంగాణ-మందమర్రి

ఇన్కమ్ టాక్స్ బోగస్ క్లైయిమ్స్‌పై ఏరియా అధికారులకు ఇన్కమ్ టాక్స్ అధికారులు అవగాహన నిర్వహించారు. గురువారం జీఎం కార్యాలయంలో ఏరియా పీఎం శ్యాంసుందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్కమ్ టాక్స్ బోగస్ క్లైయిమ్స్ గురించి ఏ సూర్య భగవాన్ ఇన్కమ్ టాక్స్ అధికారి, సిహెచ్ శ్రీనివాసరెడ్డి ఇన్కమ్ టాక్స్ ఆఫీస్ సూపరింటెండెంట్ మంచిర్యాల వారు ఏరియా సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం ఆసిఫ్ పాల్గొన్నారు.

బడ్జెట్‌తో విద్యా వ్యవస్థకు అన్యాయం

నవతెలంగాణ-మంచిర్యాల

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ కంటే ఈ సారి ప్రవేశ్ పెట్టిన బడ్జెట్‌తో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం అవలంబించిన తీరే కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తోందని, విద్యారంగానికి కేవలం 11 శాతం నిధులు కేటాయించడంతో ఏ రకంగా విద్య వ్యవస్థ అభివృద్ధి చెందుతుందో రాష్ట్ర ప్రభుత్వం తెలపాలని డిమాండ్ చేశారు. కొఠారి కమిషన్ ప్రకారం రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలని, మన ఊరు మనబడి పథకంతో పాఠశాలల అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఉన్న బడ్జెట్‌తో ఏ విధంగా అబివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్‌ను నిరసిస్తూ రేపు రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.